నీతిలేని కథ

శంకర్రావు, భోజనం చేస్తూ, ఏదో ఆలోచిస్తూ ఉండటాన్ని, వడ్డిస్తోన్న శారద, గమనించింది. ఎప్పుడూ లేనిది, ఆయన ఆరోజు ఎందుకంత పరధ్యానంగా ఉన్నారో, ఆమెకి అంతుచిక్కలేదు. భర్త, చాలా సెన్సిటివ్ వ్యక్తని ఆమెకి బాగా తెలుసు. అయితే, ఎప్పుడేం జరిగినా, తనతో పూసగుచ్చినట్లు చెప్పేవ్యక్తి, ఈరోజు ఏవీ చెప్పకుండా, లోలోపలే మదనపడుతున్నారని సందేహించింది.

"ఈరోజు, మీరేదో పరధ్యానంగా ఉన్నారండీ! ఏంజరిగిందేవిటి?" ఉండబట్టలేక, ప్రశ్నించింది శారద.

శంకర్రావు, చప్పున సమాధానం చెప్పలేదు. అతని మొహంలో కాస్తంత రంగు మారింది. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో ఇదమిత్థం తేల్చుకోలేకపోయాడు. ఇంక అన్నం తినబుద్ధి కాకపోవడంతో, చెయ్యి కడుక్కున్నాడు.

శారద విస్తుపోయింది. ఆమె హృదయం కలుక్కుమంది.

"తినకుండా లేచిపోతున్నారేవిఁటండీ? అంది, ఆరాటంతో.

"తినాలనిపించడంలేదు శారదా!" అంటూ లేచి వెళ్ళిపోయాడు.

శారదకి, ఆరాటం అధికమయ్యింది. భర్త అంతగా కలవరపడ్డం, పరధ్యానంగా ఉండటం, ఆమె ఎప్పుడూ చూళ్లేదు. దీనికేదో బలీయమైన కారణం ఉండి ఉంటుందనే నిర్ణయానికొచ్చి, కంగారు పడింది. భోజనం చెయ్యాలని కూచుంది గాని, ఆమెకి తినబుద్ధికాలేదు ఏదో ఎంగిలి పడ్డాననిపించుకుని లేచింది. వంటగది చక్కబెట్టుకుని, భర్త గదిలోకి వెళ్ళింది.

శంకర్రావు, వాలు కుర్చీలో చేరబడి, తీవ్రంగా యోచిస్తున్నాడు. అతని మొహం బాగా వాడిపోయి ఉంది. కళ్ళల్లో ఏదో బెదురు స్పష్టంగా అగుపిస్తోంది. శారద, భర్తకి అభిముఖంగా ఉన్న బల్లమీద కూలబడింది.

"ఇవ్వాళ మీరెందుకో అదోలా ఉన్నారండీ! ఇంతకీ ఏం జరిగింది? విషయం ఏవిఁటో చెప్పకుండా మీ మనస్సులోనే బాధనంతా దాచేసుకుని కుమిలిపోవడం ఎందుకు చెప్పండి? మీ బాధను పంచుకునే అవకాశాన్ని నాకూ ఇవ్వండి" అంది శారద మెల్లగా.

భార్య ఆరాటాన్ని అవగాహన చేసుకున్నాడు శంకర్రావు నిజమే! తనలోని బాధతో తను కుమిలిపోయేకంటే విషయాన్ని ఆమెతోచెప్పి, హృదయ భారాన్ని కొంతయినా తగ్గించుకోవడం మంచిదేమోననిపించిందతనికి. ఆవేదనాపూరితంగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"ఎలా చెప్పడమో నాకు తోచడంలేదు శారదా!" అతని గొంతు బొంగురుపోయింది. వస్తోన్న దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తున్నట్టు ఇట్టే గ్రహించవచ్చు.

శారద మరింత తల్లడిల్లి పోయింది, భర్త గొంతులోని మార్పు చూసి. ఆమెకి ఏడుపొచ్చినట్టయ్యింది "ఇంతకీ జరిగిందేవిఁటో చెప్పండీ? నా కేవిఁటో భయంగా ఉంది" అంది రుద్ధ స్వరంతో.

"ఈరోజు నా జీవితానికి గ్రహణం పట్టినరోజు శారదా" ఇంక చెప్పలేకపోతున్నట్టుగా ఆగిపోయాడు.

"ఆగిపోయారేం? ఏమయ్యిందో చెప్పండీ" సుమారు ఏడుస్తూనే అంది శారద.

"లంచం తీసుకోవడం అపరాధమని అందరికీ తెలిసిన విషయమే!

అలాగని అవకాశాలుండి, ధైర్యం గల వాళ్లెవరూ లంచాలు తీసుకోవడం మానలేదు. ఈ విషయంలో నేను మొన్న మొన్నటి వరకూ జాగ్రత్తగా ఉన్నా, తోటి ఉద్యోగుల ప్రోద్బలంతో ఇటీవల అందరిలా నేను లంచాలు తీసుకోవడం ఆరంభించాను. ఈరోజు నా పాపం పండినట్టుగా, మా ఆఫీసరు నేను లంచం తీసుకుంటూ ఉండగా చూశాడు" అంటూ ఆగాడు, శంకర్రావు నిట్టూర్పు విడిచి.

"ఎంతపని జరిగిందండీ? మన దురదృష్టం గాకపోతే మీరే అతని దృష్టిలో పడాలా?" అంది శారద రుద్ధ స్వరంతో.

"చెప్పానుకదా శారదా? ఈ రోజు నా జీవితాన్ని అధఃపాతాళానికి తొక్కిపెట్టిన చెడురోజు. చూసి, అతను వూరుకున్నాడంటావా? అబ్బే! లేదు ...నేరుగా నా దగ్గరికొచ్చి, లంచమిచ్చినవ్యక్తిని ఎడాపెడా చీవాట్లు పెట్టి, అతణ్ణి వెళ్ళగొట్టి, అతను అందజేసిన యాభై రూపాయలూ నా జేబులోంచి తీసి, నావేపు చురచురా చూసి, తన గదిలోకి వెళ్ళిపోయాడు. నిజం చెప్పాలంటే, ఆ క్షణంలోనే నా గుండెలు ఆగిపోయినట్టయి, కర్ర గట్టిపోయాను. నలుగురి ఎదుట జరిగిన ఈ అవమానానికి, నాకు తల కొట్టేసినంత పనయింది. అక్కడితో కథ అంతమైతే పరవాలేదు. ముందు ముందేం జరుగనున్నదో, భగవంతుడికే తెలియాలి. రేపటికి నా ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో చెప్పలేం. నా పరధ్యానానికి, నా ఆలోచనలకి కారణం ఏమిటో ఇప్పుడు నీకర్థమై ఉంటుంది" అంటూ నిస్పృహతో చెప్పుకుపోయాడు శంకర్రావు.

శారద కళ్లు అప్రయత్నంగా అశ్రుపూరితాలయ్యాయి. పరిస్థితి అర్థమై, ఏం జరుగనున్నదో వూహించుకునేసరికి, భవిష్యత్తు అంధకార బంధురంగా అగుపించింది. లంచం తీసుకోవడం నేరమని తెలిసికూడా, భర్త అటువంటి ప్రలోభానికి ఎందుకు లోనయ్యారో అనుకుంది. అయితే ఆ ప్రశ్న వెయ్యడం, ఆయన్ని మరింత సంక్షోభపర్చడమే జరుగు తుందనిపించి, చీర చెరగుతో కన్నీరు ఒత్తుకుంది.

"మనమేం పాపం చేశామని మనకిలాంటి ఉపద్రవం తెచ్చి పెట్టాడండీ భగవంతుడు? ఏదో ఓ మార్గం చూడండీ! మీ ఆఫీసర్ని

ప్రతిమాలుకోండి.... మళ్ళీ ఎప్పుడూ ఇటువంటి నీచపు పనిచెయ్యనని లెంపలేసుకోండి ఆయన మనసు కరిగి క్షమిస్తాడేమో!" అంది.

"ఆయన కొత్తగా వచ్చాడు. సూటిగా పోయే వ్యక్తని ప్రతీతి. అందుకే ఏ ప్రయత్నం చెయ్యడానికి భయంగా ఉంది. ఇంకెవరైనా అయితే ప్రతిమలాడో, లేక లెంపలేసుకునో, అదీ కాదంటే డబ్బుకి కరిగే మనిషయితే లంచమిచ్చో, ఈ ఇక్కట్టు నుండి తప్పించుకునేవాణ్ణి.... కాని, ఈయన వినిపించుకోడట ..." దిగాలుగా అన్నాడు శంకర్రావు.

శారద మాత్రం ఇంకేం సలహా ఇస్తుంది? "అయినా ప్రయత్నించి చూడండి? దేవుడిమీద భారం వెయ్యండి. ఈ పరిస్థితిలో అంతకంటే మనం చెయ్యగలిగిందేమీ లేదు. ఆ వేంకటేశ్వరస్వామే మనల్ని కాపాడుతాడు. ఈ ప్రమాదం తప్పిందంటే, తిరుమలకెళ్ళి ఆ స్వామి దర్శనం చేసుకుందాం...." అంటూ భగవంతుడిమీద భారం వేసింది శారద.

"అలాగే ప్రయత్నిస్తాను....అపైన మన అదృష్టం...." అంటూ లేచి మంచంమీద ఒరిగాడు శంకర్రావు.

ఆ రోజు రాత్రి శంకర్రావు దంపతులకు కంటినిండా నిద్ర పట్ట లేదంటే అతిశయోక్తి ఉండదు.

*　　　*　　　*

మరుసటిరోజు ఉదయం—

పది గంటలు దాటి పదినిముషాలయ్యింది. శంకర్రావు తన సీటులో కూచున్నాడేగాని, ముళ్ళకంపమీద కూచున్నట్టే ఉందతనికి. తనింక ఆసీట్లో ఉంటాడా? అసలు, ఆ ఆఫీసులో ఉంటాడా? ఉద్యోగం ఉంటుందా? వూడుతుందా? తనిప్పుడేం చెయ్యాలి? ఆఫీసరు కాళ్ళమీద పడితే? ఇలా అతని ఆలోచనలు సాగిపోతున్నయ్. ఏ నిర్ణయానికి రాలేని అస్థిమిత స్థితిలో ఉన్నాడు.

"బాబూ, అయ్యగారు పిలుస్తునారండీ" బంట్రోతు వచ్చి చెప్పాడు.

తృళ్ళి పడ్డాడు శంకర్రావు. అతనికి హృదయ స్పందన అధిక మయ్యింది. హఠాత్తుగా మొహం స్వేదంతో నిండిపోయింది. జేబులోంచి ధుమాలు తీసి, మొహాన్ని ఓసారి ఒత్తుకున్నాడు. లేస్తుంటే కాళ్ళు వణికాయి.

సరి! అయిపోయింది. ఈ రోజుతో తనకి ఈ ఆఫీసుకి ఋణం తీరిపోతుంది. ఇంకేముంది? తాను వెళ్ళిన వెంటనే తన చేతిలో డిస్మిసల్ లెటర్ పెట్టి పొమ్మంటాడు ఆఫీసర్. తప్పదు....అనుకుంటుంటే, ఆతనికి ఏడుపొచ్చింది. ఛీ! ఛీ! తనెందుకి అప్రాచ్యపు పనికి పూనుకోవాలి? తనకేం లోపమని? ఇప్పుడెందుకి నరకయాతన మానసికంగా అనుభవించాలి? నలుగురూ తనకేసి ఎలా చూస్తున్నారని? అంతా ఖర్మ! అనుభవించక తప్పదు. అనుకుంటూ మెల్లగా ఆఫీసరు గదిలోకి స్ప్రింగ్ డోర్ తోసుకుని వెళ్ళాడు తన సహోద్యోగులు చెవులు కొరుక్కుంటూ ఉండటం కూడా గమనించాడు కూడా. కాని ఏంచెయ్యగలడు? దొరికిన దొంగ తనే! వాళ్ళంతా దొరకని దొంగలు....

"గుడ్ మార్నింగ్ సార్" సవినయంగా అన్నాడు శంకర్రావు. అతని కంఠస్వరం కంపించింది.

"గుడ్ మార్నింగ్ కూచో" గంభీరంగా అన్నాడు ఆఫీసరు. అతని మొహం కందగడ్డలా వుండటంతో, ఆ మొహంలో సూటిగా చూళ్ళేక పోయాడు శంకర్రావు. కూచోడానికి భీతిల్లి నుంచునే ఉన్నాడు.

"పరవాలేదు సార్" అన్నాడు.

"నీ సర్వీసు ఎన్నాళ్ళయ్యింది?"

"పదిహేనేళ్లు సార్."

"ఎన్నాళ్ళనించి నువ్విలా లంచాలు పుచ్చుకోడం సాగిస్తున్నావు?"

శంకర్రావు తడబడ్డాడు, ఉన్నది ఉన్నట్టుగానే చెప్పేసి, బ్రతిమలాడ్డం మంచిదనుకున్నాడు.

"ఇది మూడోసారి! సార్. మొదట్లో లంచాలు తీసుకోవడమంటే వ్యతిరేకించేవాణ్ణి. కాని, సహవాసదోషం నన్నిలా మార్చింది. వాళ్లు బలవంతంచేసి ఇస్తున్నారు సార్! ఏంచెయ్యను? ప్రలోభపడ్డాను! తప్పయింది సార్. ఈ ఒక్కసారికి నన్ను క్షమించండి సార్ మళ్ళీ ఎప్పుడూ ఇలా గడ్డికరవనని తమకి హామీ ఇస్తున్నాను" అంటూ ఒక్క గుక్కలో యేకరువు పెట్టాడు శంకర్రావు ప్రాధేయపూర్వకంగా.

అంతా విన్న ఆఫీసరు నవ్వేడు. ఆ నవ్వులో సౌమ్యత లేదు.

అందుకే శంకర్రావు కంగారు పడిపోయాడు. ఇంత ప్రాధేయపడినా అతని మనస్సు కరగలేకపోయినందుకు బాధపడ్డాడు.

అయితే నీకు వాళ్ళు బలవంతంగా ఇస్తున్నారంటావు!" అన్నాడు ఆఫీసరు.

'ఔను సార్! వాళ్ళ కాంట్రాక్టు బిల్సు కాస్త తొందరగా పంపమని ఒకటే పాట పాడుతూ, బలవంతంగా జేబులో పడేస్తారు డబ్బు ఏం చెయ్యను?"

"ఇచ్చేవాళ్లు బాగా డబ్బున్నవాళ్లేనా?"

"ఉన్నవాళ్ళే సార్! లేకపోతే కాంట్రాక్టు ఎలా తీసుకుంటారు చెప్పండి? వేలకివేలు సంపాదిస్తున్నారు "

"వాళ్ళు అన్యాయంచేసి అక్రమంగా సంపాదిస్తున్నారంటావు?"

"సార్...." చెప్పడానికి సంకోచించి అదోలా చూశాడు శంకర్రావు.

"చెప్పవోయ్ భయంలేదు" అభయమిచ్చాడు ఆఫీసరు.

"లేకపోతే మాకు డబ్బెందుకిస్తారు సార్?"

"అయితే ఫరవాలేదు కాని పేదవాళ్ళ దగ్గర కక్కుర్తిపడకు పార్టీని చూసి మరీ ప్రవర్తించు" అని చెప్పిన ఆఫీసరుకేసి, వింతగా చూశాడు శంకర్రావు, తన చెవుల్ని తనే నమ్మలేక పోయాడు.

"సార్ ... మీరు చెబుతున్నది ...." అర్ధోక్తిలో ఆపేశాడు.

"ఇందులో అబద్ధం లేదోయ్ ... నిజమే చెబుతున్నాను. ఒక్క విషయం ఆలోచించు. డబ్బు సంపాదించాలనుకున్నవాడు, నిజాయితీగా ఎప్పుడూ సంపాదించలేడు. ఏ కొద్ది మందో తప్పించి, డబ్బు గడించిన ప్రతి వ్యక్తి యేదో విధమైన అన్యాయం చేసే గడిస్తున్నాడన్నది నిర్వివాదాంశం! ఈ విశాల విశ్వంలో మనమనగా యెంత? అయితే హద్దు మీర కూడదు. ఇదిగో – నిన్న నీ జేబులోంచి తీసిన యాభై రూపాయలు. ఇందులో ఫిఫ్టీ పర్సంటు నా భాగంగా తీసుకున్నాను. మిగిలిన ఫిఫ్టీ పర్సంటు నీది ... తీసుకో!" అంటూ పాతిక రూపాయలు అందించాడు శంకర్రావుకి, ఆఫీసరు.

శంకర్రావు నివ్వెరపోయాడు. ఇదో కొత్త వింతలా తోచినది. అయితేనేం – తానూహించిన ప్రమాదం తప్పినందుకు మనసు కుదుటబడింది. అతనిలో ఆ క్షణం వరకూ దోబూచులాడుతూ వుండే భయం పటాపంచలయ్యింది.

అంత గంభీరమైన ఆఫీసరులో అటువంటి మార్పు తెచ్చినందుకు, భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు మనసులో. ఆ డబ్బు తీసుకుని జేబులో వేసుకున్నాడు.

"చాలా థాంక్స్ సార్! మీ మేలు యెన్నటికీ మర్చిపోను." అన్నాడు కృతజ్ఞతా భావంతో.

"దీని అంతరార్థం తెలిసిందా?"

"ఎస్సార్" నవ్వుతూనే సమాధానమిచ్చాడు.

"ఓ కే! ఇక వెళ్లు."

మందహాసంతో, బోర విరుచుకుంటూ బైటికొచ్చాడు శంకర్రావు.

"ఏమన్నారేవిఁటి?" సహోద్యోగులు ఆసక్తితో అడిగారు చుట్టూ మూగి.

"ఏమంటారు మర్యాదగా చివాట్లు పెట్టి, 'తప్పు నాయనా' అన్నారు అంతే."

"అంతేనా?" ఆశ్చర్యంగా అడిగారు వాళ్ళంతా శంకర్రావుని ఏదో విధంగా శిక్షిస్తారనుకున్న వాళ్ళకి నిరాశే కలిగింది.

"అంతే మరి!" నిజం చెప్పడం యిష్టం లేకపోయింది, శంకర్రావుకి.

శంకర్రావు హుషారుగా తన సీట్లో కూచుని పని ప్రారంభించాడు.

* * *

సాయంకాలం ఆరింటికి ఇల్లు చేరుకున్నాడు. శంకర్రావు భర్త రాక కోసం యెదురు చూస్తోన్న శారద, భర్త హుషారుగా వున్నందుకు, లోలోన మురిసిపోయింది. "మీ ఆఫీసరు యేమన్నాడండీ? కనికరించి క్షమించాడా?" అంది లోపలికి వస్తూ.

"వాడి మొహం! వాడు కనికరించేదేవిఁటి? వాడు డబ్బుకి కక్కుర్తి పడేరకమే!"

"అంటే ...." భర్త మాటల్లోని భావం యేవిఁటో అర్థం గాక అడిగింది.

"నేను సంపాదించిన దాంట్లో సగం వాడికివ్వాలి అదీ ఒప్పందం."

శారద తెల్లబోయింది.

"అంటే అతనూ లంచం తీసుకుంటాడన్న మాట...." కళ్ళింతవి చేసుకుంటూ అడిగింది.

శంకర్రావు నిండుగా నవ్వేడు.

"అన్నమాటేవిఁటి? వున్నమాటే! బైట పడనంతవరకూ అందరూ నీతిమంతులే శారదా! లోతుకి పోతే, ప్రతి వ్యక్తి కథా ఓ అవినీతి కథలా వుంటుందేమో! అన్నట్టు యిదిగో సంపెంగలు .... ఆ పొట్లంలో హల్వా, పకోడీలు వున్నయ్ .... నాకు స్ట్రాంగు కాఫీ యివ్వు...." అంటూ రెండు పొట్లాలు అందించాడు, శంకర్రావు.

శారదకి నోట మాట రాలేదు. నీతి, నిజాయితీ యెక్కడున్నయ్? వీటికి అర్థం యేవిఁటి? .... అనుకుంటూ లోపలికి నడిచింది.

శంకర్రావు నవ్వుకుంటూ, జేబులోంచి డబ్బుతీసి, బీరువాలో పెట్టేశాడు.

* ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 23-2-1979 *